
'మంచి పుస్తకం'కు జేజేలు

# పిల్లల మామయ్య, పుస్తకాల నేస్తం కొసరాజు సురేష్



**సురేష్ ... 'మంచి పుస్తకం' సురేష్ పయనం గురించి సీనియర్ పాత్రికేయులు మద్దిపట్ల మణి గతంలో ఒక ప్రత్యేక సందర్భంలో వ్యాసం రాశారు. అది ముద్రితం కాలేదు. ఆ వ్యాసంకు మంచి పుస్తకం 20 ఏళ్ల వేడుకల వివరాలు జోడించి 'రైతునేస్తం' పాఠకులకు ప్రత్యేకంగా అందిస్తున్నాం. బాల్యం నుంచే పర్యావరణం, ప్రకృతి పట్ల అవగాహన ఉండాలి అంటూ పిల్లల సాహిత్యం ద్వారా ఎనలేని కృషి మంచి పుస్తకం చేసింది. సురేష్ వీటితోపాటు ప్రత్యామ్నాయ వ్యవసాయం కోసం పరితపిస్తూ పలు పుస్తకాలు కూడా ప్రచురించారు. ఇవి అందరూ చదవాలి కూడా. మంచి పుస్తకం ద్విదశాబ్ది వేడుకల ముగింపు సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక వ్యాసమిది.** - సంపాదకులు

వ్యవసాయం అంటే ఆసక్తి...
అనువాదమంటే అనురక్తి...
ఈ రెంటిని కలగలిపితే, ఆ వ్యక్తి సురేష్.

వ్యవసాయ శాస్త్రంలో పీజీ చేసిన కొసరాజు సురేష్. బ్యాంక్ ఉద్యోగం కాదనుకుని స్వచ్ఛంద సంస్థలో చేరారు. తరవాత జర్నలిజం, సేంద్రియ వ్యవసాయ విధానాలపై అధ్యయనం, ప్రభుత్వ కొలువు.. అలా సాగిన ఆయన జీవితం, ప్రస్తుతం 'మంచి పుస్తకం'తో ముడిపడి ఉంది.

సౌమ్యుడైన సురేష్, తన అభిప్రాయాన్ని స్పష్టంగా, బలంగా చెప్పడంలో దిట్ట. తాను అనుకున్న విధంగా ముందుకు సాగడమే ఆయనకు తెలుసు. ప్రస్తుతం ఒక 'బాలమిత్ర'.

ఆసక్తి తగ్గినా, చేస్తున్న పని సంతోషం కలిగించకున్నా, తన ఆలోచనలకు అనుగుణంగా లేకున్నా, ఆ వ్యాపకంలో ఒక్క క్షణం ఉండటమనేది అయిదు పదులు నిండిన ఆయన జీవితంలో లేనేలేదు. వెనక్కు తిరిగి చూసుకుని, ఒక్కసారి ఆగి, వగచే ప్రసక్తే లేదు. వీటన్నింటినీ ఆయన మాటల్లోనే...

కృష్ణా జిల్లా కురుమద్దాలి నా స్వస్థలం. మాది మధ్యతరగతి వ్యవసాయదారుల కుటుంబం. నాన్నగారు కాంట్రాక్టులు చేపట్టేందుకు నా చిన్నతనంలో హైదరాబాద్ వచ్చారు. అందువల్ల అయిదో తరగతి వరకు నా విద్యాభ్యాసం భాగ్యనగరానికి సమీపంలోని పటాన్‌చెరు, బిహెచ్ఇఎల్‌లో జరిగింది. ఆ తరువాత విజయవాడకు మారాం. అక్కడే ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాను. నాకెందుకో మొదటి నుంచి వ్యవసాయంపై ఆసక్తి. ఇంటర్లో బైపిసి గ్రూపు తీసుకున్నా. అప్పట్లో మెడిసిన్ ఎంట్రెన్స్‌వైపు చూడని వ్యక్తిని బహుశా నేను ఒక్కడినే అనుకుంటాను.

వ్యవసాయ పట్టా కోసం ఇప్పటి ఉత్తరాఖండ్‌లోని పంత్‌నగర్‌లో చేరాను. కోర్సు పూర్తి చేసిన తరవాత సొంతంగా వ్యవసాయం చేసుకోవాలన్నది నా ఆకాంక్ష. వ్యవసాయ పనులంటే ఇష్టం ఉన్నప్పటికీ, పనివాళ్ళందరినీ కలుపుకొని వెళ్ళడం ఆచరణలో అంత సులువైన వ్యవహారం కాదని వెంటనే తెలిసింది. నాన్నకూడా నా సహాయం అవసరం లేదన్నారు. దాంతో తిరిగి ఎమ్మెస్సీ యానిమల్ న్యూట్రిషన్‌లో చేరాను.

ఈలోపు సేంద్రియ వ్యవసాయ విధనాలపై నా ఆలోచనలు మళ్ళాయి. మా ప్రొఫెసర్ ఎం.జి.జాక్సన్ 'హరిత విప్లవం'తో జరుగుతున్న నష్టాలను వివరించేవారు. పిహెచ్‌డి స్కాలర్ గయా ప్రసాద్ సహచర్యంతో నా ఆలోచనలు మరింత విస్తృతమయ్యాయి.

మధ్యప్రదేశ్‌లో స్వచ్ఛంద సంస్థ 'కిషోర్ భారతి' వ్యవస్థాపకుడు అనిల్ సద్గోపాల్ విజ్ఞాన శాస్త్రంపై, సమాజానికి దాన్ని అన్వయించడంపై ఆయన రాసిన వ్యాసం నాపై బలమైన ప్రభావాన్ని చూపింది. అప్పటికే వచ్చిన బ్యాంక్ ఉద్యోగం కాదనుకున్న నేను, ఎమ్మెస్సీ పూర్తి చేశాక అక్కడికి వెళ్ళాను. రెండేళ్ళు అక్కడ ఉన్నాను. గ్రామీణాభివృద్ధి, ప్రత్యామ్నాయ విద్య తదితరాలపై అక్కడ పని చేసేవాళ్ళం. అక్కడ ఉన్నప్పుడే భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగింది.

స్వరాష్ట్రానికి రావాలన్న ఆకాంక్ష ముందు నుంచీ ఉంది. వివిధ పుస్తకాలు మొదటి నుంచి నన్ను బాగా ప్రభావితం చేసేవి. మధ్యప్రదేశ్ నుంచి విజయవాడ రాగానే జర్నలిస్ట్‌గా పనిచేయాలని అనుకున్నాను. అగ్రికల్చర్‌లో పీజీ చేసినవారిని తీసుకుంటే, ఎక్కువ కాలం పనిచేయనని భావించారేమో మరియు, విజయవాడలో సంపాదకులు ఎవరూ నాకు ఉద్యోగం ఇవ్వలేదు.

ఈలోపు ఈనాడులో 'రైతే రాజు'లో పనిచేసే అవకాశం వచ్చింది. తెలుగు భాష, అనువాదంలో నా నైపుణ్యం అక్కడే రూపుదిద్దుకున్నాయి. ప్రగతిశీల సాహిత్యం, పెద్దవాళ్ళ సాహిత్యానికి ప్రత్యేక సంస్థలు ఉన్నాయి. పిల్లల సాహిత్యానికి అలాంటి ప్రత్యేక ఏర్పాటు లేదని గుర్తించి 'బాల సాహితి' పేరుతో సుబ్బయ్య, నేను ఒక ట్రస్టును ఏర్పాటు చేశాం. బాల్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ కూడా దీంట్లో భాగస్వాములు. అందరం వేర్వేరు ఉద్యోగాలు చేసుకుంటూనే ఒక దశాబ్ద కాలంలో దాదాపు 35 పుస్తకాలు ప్రచురించాం. ఒక రకంగా బాల సాహితికి అలాగే పుస్తకాల ప్రచురణ, ప్రోత్సాహం అన్న పనికి కొనసాగింపే ఇప్పటి 'మంచి పుస్తకం.

'రైతే రాజు' శీర్షిక కింద వారంలో ఒక రోజు ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులకు సంబంధించి వ్యాసాలను అనువదించి అందించేవాడిని. జపాన్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయదారుడు రాసిన గడ్డిపరకతో విప్లవంలోని



కొసరాజు సురేష్ - భాగ్యలక్ష్మి దంపతులు



కొన్ని భాగాలు ముందుగా ఈ శీర్షికలో ప్రచురితమయ్యాయి. అయితే అదే శీర్షికలో అగ్రికల్చరల్ బ్యూరో చీఫ్ డాక్టర్ వాసిరెడ్డి నారాయణరావు గారు అనుసరిస్తున్న పంథాకి, నేను ఇచ్చే వ్యాసాలకి వైరుధ్యం ఉంటోంది. దేశానికి కావాల్సింది చౌకగా అధిక ఉత్పత్తి తప్ప సేంద్రియ వ్యవసాయం కాదన్నది ఆయన వాదన. దీనిపై రాయటం కాదు, ఆచరణీయ ఫలితాలు ముఖ్యం అన్న ఆయన మాటలు నన్ను ఆలోచింపజేశాయి. అసలు అదేమిటో తెలుసుకోవాలని పాండిచ్చేరిలోని ఆరోవిల్‌కి వెళ్ళాను. అక్కడ కొంతకాలం పనిచేశాను.



ఏప్రిల్ 15న హైదరాబాద్ ఖైరతాబాద్‌లో జరిగిన మంచిపుస్తకం@20 ఆత్మీయ సమావేశంలో పుస్తకావిష్కరణ చేస్తున్న 'మిసిమి' సంపాదకులు వల్లభనేని అశ్వినీ కుమార్, 'రైతునేస్తం' వేంకటేశ్వరరావు, కందుకూరి రమేష్‌బాబు, చెన్నూరి సీతారాంబాబు, వలేటి గోపీచంద్, కొసరాజు సురేష్.

## సురేష్ కొనసాగింపు...

**పిల్లలు అనేసరికి చాలా మందికి నీతి చెప్పాలని బలంగా ఉంటుంది. దేశభక్తి చెప్పాలని ఉంటుంది. భావి పౌరులుగా సమతారాజ్య నిర్మాతలుగా తీర్చిదిద్దాలని కూడా ఉంటుంది. అయితే, నా ఉద్దేశంలో మొట్టమొదటి కర్తవ్యం, పిల్లల్లో పుస్తకాలపై ప్రేమ పెంచడం. చక్కటి బొమ్మలతో, ఆసక్తి కలిగించే కథలతో, ఊహాశక్తిని పెంచే కల్పనలతో పిల్లల పుస్తకాలు ఉండాలి. ఇటువంటి పుస్తకాలు తీసుకురావటానికి 'బాలసాహితి' రోజుల నుంచి ఎదురీదటమే మా అనుభవం. చాలామంది తల్లిదండ్రులు, మీదగ్గర నీతి కథలు ఉన్నాయా అని మమ్మల్ని అడిగినప్పుడు లేవని చెబుతాం. ఈసపు కథలను టాల్‌స్టాయ్ తిరిగి రాసినప్పుడు, వాటి చివర్లో ఉండే నీతిని తీసేశారు. నీతి ప్రసక్తి లేని ఈసపు కథలు ఒక్క 'మంచి పుస్తకం' వద్ద మాత్రమే లభిస్తాయి. పిల్లలకు చదవటంపై ఇష్టం, పుస్తకాలపై ప్రేమ కలిగించటమే మంచి పుస్తకం లక్ష్యం. పిల్లలు పెద్దయిన తరవాత ఎటువంటి పుస్తకాలు చదవాలి, ఏం కావాలి అన్నది విస్తృత సమాజం, ఎవరికి వాళ్ళు నిర్ణయానికే నేను వదిలేస్తాను.**

ఈలోగా, సరిగ్గా నా 32వ ఏట ప్రభుత్వ ఉద్యోగం వ్యవసాయ అధికారిగా ఉద్యోగం వచ్చింది. అది ఎలా ఉంటుందో చూద్దాం అనిపించింది. ఆఖర్లో ఆరు నెలలు తప్ప, చాలా వరకు నేను అక్కడా అదృష్టవంతుడినని చెప్పాలి. పద్నాలుగు సంవత్సరాలు సర్కారు సేవలో తరించాను. ఘంటసాలలోని విత్తనోత్పత్తి క్షేత్రంలో నాలుగేళ్ళు స్వర్ణయుగమనే చెప్పాలి. అచ్చంగా వ్యవసాయ పనుల్లో తలమునకలయ్యాను. అలా నా చిన్ననాటి ముచ్చట తీరింది. వ్యవసాయశాఖలో ఉంటూనే 'అపార్డ్'లో అయిదేళ్ళు, 'వాసన్' అనే స్వచ్ఛంద సంస్థలో నాలుగేళ్ళు డెప్యుటేషన్‌పై పనిచేశాను.

ఒక వ్యక్తి ఉద్యోగ విధులకే పరిమితం కాకుండా, వారి సొంత ఆసక్తులనూ ప్రోత్సహించాలన్న దృక్పథం 'వాసన్'కు ఉంది. దాంతో సరదాగా పుస్తకాల అమ్మకం, ప్రోత్సాహం, ప్రచురణ పనులను 'మంచి పుస్తకం' పేరుతో తిరిగి మొదలు పెట్టాను. మొట్టమొదటిసారి హైదరాబాద్‌లో 17వ బుక్‌ఫేర్‌లో 'పుస్తకాలతో స్నేహం' పేరుతో పిల్లల పుస్తకాలను ప్రదర్శించాం. పిల్లలు అలాగే విద్యపై తెలుగులో 600 వరకు పుస్తకాలను అందుబాటులోకి తేవటంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఈ ప్రయత్నంలో ఎందరో భాగస్వాములయ్యారు, స్వచ్ఛందంగా పని చేశారు. పిల్లల పుస్తకాలపై ప్రచురణకర్తలకు ఆసక్తి పెరగటానికి ఇది ఎంతగానో దోహదపడింది. మంచి పుస్తకం కార్యకలాపాలు పెరుగుతుండటంతో 2004లో రవీంద్రతో కలసి దీన్ని ట్రస్ట్‌గా రిజిస్టర్ చేయించాం. ఈ సమయంలోనే వ్యవసాయశాఖలో నాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రమోషన్ వచ్చింది. అక్కడి కాకుల లెక్కలు, కాగితాలకు పరిమితమైన పని, అవినీతితో విసిగిపోయాను. ఎనిమిది నెలలకే రాజీనామా చేసి తిరిగి వాసన్‌లో చేరాను. ప్రస్తుతం వాసన్ నుంచి సెలవు తీసుకున్నాను. మొత్తమ్మీద నెలలో ఒక వారం పొట్టకూటి కోసం అవసరమైన పనికి కేటాయించుకున్నాను. మిగిలిన మూడు వారాలూ 'మంచి పుస్తకం' కోసం మిగుల్చుకున్నాను.

అనువాదాలపై అనురక్తి అని ఇంతకుముందే చెప్పాను. మొదట 'టింబక్టు' ద్వారా ప్రచురించిన 'గడ్డిపరకతో విప్లవం' ఎంతో ఆదరణ పొందింది. ఇటీవల తెలుగులోకి తీసుకువచ్చిన పాలో కొయిలో 'పరుసవేది' ఎంతో పేరు తెచ్చిపెట్టింది. హెచ్‌బిటి ప్రచురణలైన ఖలీల్ గిబ్రాన్ 'జీవనగీతం', ఎ.ఎల్.నీల్ 'పిల్లల పెంపకం' అదేవిధంగా లిఖిత ప్రచురణ విజయ్ దాన్ దేతా 'సందిగ్ధ' చెప్పుకోదగిన అనువాదాలు. వ్యవసాయం, మహిళల ఆరోగ్యం, పిల్లల పుస్తకాలు, కథలు, నవలలు... ఇలా ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు అనువదించాను. మరెన్నింటినో ఎడిటింగ్ చేసి ప్రచురణకు దోహదపడ్డాను.

పిల్లల పుస్తకాలను నాణ్యత, అంతకు మించి తక్కువ ధరకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ దిశలోనే అనువాదాలను ఎంచుకున్నాం. మా పుస్తకాల ధర ఆరు రూపాయలతో మొదలవుతుంది. లక్ష్యసాధనకు అవకాశం ఉన్న చోటల్లా ఇతరులతో కలసి పనిచేయటాన్ని 'మంచి పుస్తకం' ఆశయంగా మలుచుకున్నాం. ఈ క్రమంలోనే చాలావరకు పుస్తకాలను జనవిజ్ఞాన వేదిక జి. మాల్యాద్రితో కలసి ప్రచురించాం. ఇటీవల, ఇదే దృక్పథం ఉన్న మిత్రులతో 'పాలపిట్ట' సంస్థ ద్వారా కూడా పిల్లల పుస్తకాలను ప్రచురిస్తున్నాం. బొమ్మల కథలు, విజ్ఞాన శాస్త్రం, కథలు, నవలలు దాదాపు వంద పుస్తకాల వరకు ప్రచురించాం. అంతేకాకుండా హైదరాబాద్ బుక్ ట్రస్ట్, జనవిజ్ఞాన వేదిక, చిల్డ్రన్ బుక్‌ట్రస్ట్, నేషనల్ బుక్‌ట్రస్ట్, పీకాక్ క్లాసిక్స్ ప్రచురించిన పిల్లల పుస్తకాలపై దృష్టి కేంద్రీకరించి ప్రోత్సహిస్తున్నాం. అయిదారు వేల రూపాయలకు దాదాపు రెండు వందల పుస్తకాలతో చక్కని గ్రంథాలయం ఏర్పాటు చేసుకునేందుకు సహాయపడగల స్థితిలో ఇప్పుడు మేం ఉన్నాం.

ఇప్పుడిప్పుడే పాఠశాలలు, ఇతర సంస్థల నుంచి మంచి స్పందన వస్తోంది. చక్కని పిల్లల పుస్తకాలకు 'మంచి పుస్తకం' చిరునామా అన్న స్థాయికి వచ్చాం. ఏదైనా సంస్థకు బయటికి కనిపించే ముఖం ఒక్కటే ఉండొచ్చు. అయితే, దానికి సహకరించే వాళ్ళ సంఖ్య వందల్లో ఉంటుంది. అనువదించటం, బొమ్మలు గీయటంలో ఎందరో సహకరించారు. మంచి పుస్తకం ఎదుగుతున్న నేపథ్యంలో దానికోసం వేరుగా కార్యాలయం ఏర్పాటు చేసుకున్నాం. టీచర్‌గా పని చేస్తున్న నా భార్య భాగ్యలక్ష్మి, ఉద్యోగం మానేసి ఏ జీతమూ లేకుండా మంచి పుస్తకం నిర్వహణ బాధ్యతలు చేపట్టింది.

మంచి పుస్తకం ద్వారా మాకు నచ్చిన పని, సంతోషాన్నిచ్చేది చేయగలుగుతున్నానని నమ్మకంగా చెప్పగలను. మా పుస్తకాలు చదివి, ఆనందించే పెద్దలు, పిన్నల సంఖ్య కొన్ని వందలే, అందులో సందేహం లేదు. పుస్తకం ప్రచురణలోనే చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది. పిల్లల పుస్తకాలకు ప్రోత్సాహం, అమ్మకం, పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించటం, తెలుగు భాష రక్షణ వంటి విషయాల్లో మా పరిమితులనూ గుర్తించాను.

# పిల్లల వాకిట్లో తేనెపొద్దు - 'మంచి పుస్తకం'

**పుస్తక ప్రచురణ రంగంలోఉంటూ అనేక రకాల పుస్తకాలు ప్రచురించటం గొప్పేమీ కాదు. ప్రభుత్వ కొలువులో ఉంటూ పిల్లలు పుస్తకాలు ఆశించిన స్థాయిలో రావటంలేదని బాధపడటమే కాకుండా ఏదయినా చేయాలని తపించే వారెందరుంటారు. నూటికో, కోటికో ఒకరుంటారు. ఆ ఒకరు కొసరాజు సురేష్.**

పిల్లల పుస్తకాల కోసం మిత్రులతో కలిసి "మంచి పుస్తకం" ట్రస్ట్ ఏర్పాటు చేశారు 2004లో. అంతకన్నా ముందు 'బాలసాహితి' సంస్థ మొదలుపెట్టి కొంత ఆ దిశగా పనిచేశారు సురేష్, వారి సహచరి భాగ్యలక్ష్మి.. 2004లో ఆ కార్యక్రమాన్ని మరింత విస్తరించి పిల్లల పుస్తకాల ప్రచురణ వేగం పెంచారు. ఈ సంవత్సరం అంటే 2004 ఏప్రిల్ నాటికి ఐదొందల పుస్తకాలు అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం సురేష్, భాగ్యలక్ష్మిలు తమ కొలువులను వదులుకున్నారు. పిల్లల పుస్తకాల కోసం పూర్తిస్థాయిలో పనిచేయటం మొదలుపెట్టారు. మామూలు పుస్తకానికి, పిల్లల పుస్తకానికి ఎంతో తేడా ఉంటుంది. ప్రింటింగ్ ఆకర్షణీయంగా ఉండాలి. మంచి బొమ్మలుండాలి. మళ్ళీ అవి రంగుల్లో ఉండాలి. పుస్తకం సైజ్ ఆకట్టుకోవాలి. ధర అందుబాటులో ఉండాలి. ఆ పుస్తకాన్ని ముందు తల్లిదండ్రులు ప్రేమించాలి. తమ పిల్లలు ఈ పుస్తకం చదవాలని వారు తపించాలి. ఇవన్నీ చేయలేక చాలా మంది పిల్లల పుస్తకాల జోలికి పోరు. అదొక పోరు. ఆ పోరును జయించాలన్న కాంక్ష ఉన్నవారే ఆ పని చేయగలరు. అందుకు సురేష్, భాగ్యలక్ష్మిలు ప్రత్యేకంగా అగుపిస్తారు. ఇతరులనుంచి వారిని వేరుగా చూడాలి. చాలామంది వారి కృషిని తెలుసుకుని పుస్తకాలు కొనుక్కున్నవారున్నారు. ఈ ఇరవై ఏళ్లలో తెలుగు సాహిత్య సమాజం వారిని అంతగా పట్టించుకున్నట్టుగా కూడా తోచదు. వీరు కూడా దాన్ని పట్టించుకోకపోవటం విశేషం.

ఇదంతా ఎందుకు చెప్పాల్సివస్తోందంటే "మంచి పుస్తకం" ట్రస్ట్ మొదలెట్టి ఇరవైఏళ్ళు అయిందన్న సంబరంతో ఆ ఉత్సవాన్ని ఎంతో సంబరంగా జరిపారు ఏప్రిల్ 27వ తేదీన తార్నాకలోని సెయింట్ ఆన్స్ జనరలేట్‌లో. ఊకదంపుడు ఉపన్యాసాలు లేవు. ఊరించే స్నాక్స్, లంచ్ మాత్రమే ఉన్నాయి. ఊహకు పదునుపెట్టే పుస్తకాలు ఉన్నాయి. మీరు నమ్మరు. అక్కడికి వెళ్ళటానికి తార్నాక మెట్రో దిగి ఆటో నడిపే డ్రైవర్‌ని సంప్రదిస్తే ఒకటే మాటన్నాడు.. "పిల్లల పుస్తకాల కోసమేనా.. రండి పొద్దున్నుంచి చాలామందిని దింపాను" అన్నాడు. వెళ్ళి చూస్తే, సందడంతా అక్కడే ఉంది... పిల్లలు, పెద్దలు కలిసిపోయి ఉన్నారు. బిస్కెట్లు, ఉడకబెట్టిన వేరుశనక్కాయలు, అరటి కాయలు, జామకాయలు తింటూ అటుఇటు పరిగెత్తే పిల్లలతో ఎంతో సందడిగా ఉంది ప్రాంగణమంతా. యూట్యూబ్ ఛానెల్ వాళ్ళ సందడి ఒకపక్క.. తీరిగ్గా, ఓపిగ్గా పుస్తకాలను పరిశీలిస్తూ పెద్దవాళ్ళు, వారితో కలిసి కొంచెం పెద్దపిల్లలు. ఇలా ఆటా, పాటతో సందడిగా ఉదయం పది గంటల నుంచి కిటకిటలాడుతూ సెంట్ ఆన్స్ జనరలేట్ కిలకిలలాడింది. పిల్లల పుస్తకాలు ఎవరు చదువుతారు అన్న సంశయాన్ని కొంతైనా పటాపంచలు చేసింది "మంచి పుస్తకం" ఇరవై ఏళ్ల పండగ అనిపించింది.

మంచి పుస్తకం ఎలా అడుగులేస్తూ వచ్చిందో అనే ఛార్టులు చూస్తే చాలా ఆశ్చర్యం వేసింది. సామాన్యంగా ఉంటూనే కార్పొరేట్ సంస్థ రీతిలో తమ పయనాన్ని వివరించారు సురేష్, భాగ్యలక్ష్మిలు. మరొక విషయం.. ఆ పుస్తకాల ధరలన్నీ ఆకాశన్నంటకుండా, అందరికీ అందుబాటులో ఉండేలా చూసుకోవడం, వారి నిబద్ధతను సూచించిందనిపించింది. ఆసక్తికలవారు మంచి పుస్తకం ప్రచురణలను వారికి అందుబాటులో ఉన్న గ్రంథాలయాలకు, పాఠశాలలకు అందించటం ద్వారా బాల సాహిత్యానికి తోడ్పాటునందించినవారవుతారు.

మంచిపుస్తకం కోసం పనిచేసే బృందమంతా యువతతో నిండి ఉండటం సంతోషమనిపించింది. పిల్లల పుస్తకాలకు ఆదరణ కరవులేదు.. సురేష్, భాగ్యలక్ష్మి వంటి మంచి మనుషులు మరింతమంది తయారవాలంతే. ఆ రోజు కూడా 20 శాతం రాయితీతో మంచి పుస్తకం వారి పుస్తకాలు ఒక 80 వేలు దాకా అమ్మకాలు జరిగాయి. అరవై వేల టర్నోవర్ నుంచి 20 ఏళ్ళలో అరవై లక్షలకు ఎదిగి పిల్లల పుస్తకాలకు ఉన్న మార్కెట్‌ను చూపించారు. 20 ఏళ్ల పండుగకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నలుమూలలనుంచి సందర్శకులు రావటం జరిగింది. వీరిలో 'ఈనాడు' దినపత్రిక ఆంధ్రప్రదేశ్ సంపాదకులు ఎం. నాగేశ్వరరావు, భక్తి, వనిత ఛానల్స్ సీఈఓ రఘుబాబుతోపాటు, పిల్లల పుస్తకాలను ప్రోత్సహిస్తున్న పలు సంస్థలు, ఫౌండేషన్స్ నిర్వాహకులు ఉండటం విశేషం.



**కొసరాజు సురేష్‌తో భక్తి, వనిత ఛానల్స్ సీఈఓ ఏలూరి రఘుబాబు**



**'ఈనాడు' దినపత్రిక ఆంధ్రప్రదేశ్ సంపాదకులు ఎం. నాగేశ్వరరావు, ఏలూరి రఘుబాబు**

'మంచి పుస్తకం' 20 ఏళ్ల పండుగ పురస్కరించుకుని మంచి పుస్తకం మీద వచ్చిన కథనాలు అన్నిటినీ సురేష్ అభిమాని, మిత్రుడు వలేటి గోపీచంద్ సంకలనంగా తీసుకువచ్చి ఒక వారం ముందుగానే ఏప్రిల్ 15న హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని రైతునేస్తం కార్యాలయ ఆవరణలో మంచి పుస్తకం అభిమానులు, ఆత్మీయుల మధ్య ఆవిష్కరణ సభ జరిపారు. ఆవిష్కరణ కార్యక్రమం విశేషాలను చిత్రమాలికగా రూపొందించి 20 ఏళ్ల వేడుకలో ఏప్రిల్ 27న సీనియర్ పాత్రికేయులు, భక్తి, వనిత ఛానల్ సీఈఓ ఏలూరు రఘుబాబు దంపతుల చేతులమీదుగా కొసరాజు సురేష్ దంపతులకు బహుకరించటం జరిగింది.

మంచి పుస్తకం ప్రచురించిన పుస్తకాల వివరాలకోసం **పి. భాగ్యలక్ష్మి,** సెల్: 9490746614, **కె. సురేష్,** సెల్: 7382297430 12-13-439, స్ట్రీట్ నెం. 1, తార్నాక, సికింద్రాబాద్ - 500 017. **వెబ్‌సైట్: www.manchipustakam.in** చిరునామాను సంప్రదించవచ్చు.

**- చెన్నూరు సీతారాంబాబు**

---

చేసే పనిలో జీవించాలని భావించే వ్యక్తిని నేను. ఆ జీవం కోల్పోయినప్పుడు అందులో ఇమడటం నాకు కష్టం. అందువల్ల ఇదే నా జీవితంలో చివరి మజిలీ అనుకోనవసరం లేదు. ప్రతి అయిదేళ్ళకు కొమ్మలను తెగనరకటంతో, నా జీవితం కొత్త చిగురులు తొడుగుతూనే ఉంది. జీవిత చరమాంకంలో అంటే, కాళ్ళూ చేతులూ ఆడనప్పుడు గతంలో మనం చేసిన వాటికి చింతించకుండా ఉండగలగాలి. మన జీవితాన్ని చక్కగా వినియోగించుకున్నాం అనటానికి అదే కొలమానం. మళ్ళీ ఇదే జీవితాన్ని కొనసాగించాల్సి వస్తే, ఇలాగే బతుకుతాను. అందులో సందేహం లేదు. ■

సెల్ నెం. 73822 97430
ఇమెయిల్: kosaraju.suresh.@gmail.com